క్లుప్తంగా

సౌత్ ఇండియా కరాటే, కుంగ్‌ఫూలో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న రమేశ్

కొందుర్గు: సౌత్ ఇండియా కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో కొందుర్గు మండల కేంద్రానికి చెందిన మాస్టర్ రమేశ్ ప్రతిభ చూపి 4వ డాన్ అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ విజయలక్ష్మి స్టూడియోలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో అతనికి న్యూమాంక్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ అవార్డు, బ్లాక్ బెల్ట్ అందజేశారు. ఈ సందర్భంగా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్, మండల అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి రమేశ్‌ను అభినందించారు.

రాఖీ పండగను ఘనంగా జరుపుకొంటాం



సోదరులకు రాఖీ కడుతున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: ప్రతీ సంవత్సరం రాఖీ పండగను ఘనంగా జరుపుకుంటామని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీ అన్నారు. నగరంలోని మలక్‌పేట్‌లో మా పుట్టింటికి వెళ్లి సోదరులు సందీప్, రవితేజలకు రాఖీ కడుతానన్నారు. రాజకీయ జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ప్రతీ సంవత్సరం పండగ రోజు ఇంటికెళ్లి వస్తానన్నారు. ప్రతీ ఒక్కరు సంస్కృతి, సంప్రదాయాలను మరువద్దన్నారు.

మైసమ్మ దేవాలయంలో చండీహోమం



పూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణంలోని రైతు కాలనీలో కోట మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండప పునఃపూజ, గణపతి నవగ్రహ చండీహోమం, శ్రీసూక్త హోమం, విగ్రహ శోధన, విగ్రహ దాన్యాధివాసం, మహామంగళ హారతి వంటి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్విహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు ప్రారంభిస్తున్న తండావాసులతో జెడ్పీటీసీ

కొత్తూరు: మల్లాపూర్ పంచాయతీలోని లోక్య తండాలో నెలకొన్న నీటి ఎద్దడిని మంగళవారం స్థానిక జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యానారాయణ పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా తండాలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని తండా వాసులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించి ఆమె తన సొంత నిధులతో బోరు వేయించారు. సమస్యపై వెంటనే స్పందించిన జెడ్పీటీసీని తండా వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చందర్‌నాయక్, లోబ్యానాయక్, గోపాల్, రాములు, పంతియా, బాలు, ప్రవీణ్, సాయికుమార్, రాజునాయక్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఏబీవీపీ డివిజన్ సంయుక్త కార్యదర్శి జగదీశ్



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏబీవీపీ డివిజన్ సంయుక్త కార్యదర్శి జగదీశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్వభారతి, విజ్ఞాన్, విజేత జూనియర్ కళాశాలల్లో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగదీశ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత, విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్, నవీన్, అమరేందర్‌రెడ్డి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ముందే మురుగు పరుగు

- కాసింబౌలిలో ఏరులై పారుతున్న నీరు
- దుర్వాసన వెదజల్లుతుందని ఫిర్యాదు
- మురుగు తొలగించాలని గ్రామస్తుల మొర



కాసింబౌలిలో ఇళ్ల ముందు పారుతున్న మురుగు

మొయినాబాద్‌రూరల్: అండర్ డ్రైనేజీ మురుగు కాలువ ఉప్పొంగి ఇళ్ల ముందు నుంచి రోడ్డుపై వరద పారుతుంది. వారం పది రోజుల నుంచి మురుగు నీరు ఉప్పొంగి ఏరులై పరుగు తీస్తుంది. దీని గురించి పంచాయతీ పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసింబౌలి గ్రామంలో డ్రైనేజీ పొంగడంతో ఇళ్ల ముందు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. మురుగు వాసనతో స్థానికులు ఉండలేక పోతున్నామని సంబంధిత అధికారులతో మొర పెట్టుకుంటున్న ప్రయోజనం లేకుండా పోతుంది. దీంతో ఇక్కడ దోమలు, ఈగలు చేరి వ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలేదని వారు చెబుతున్నారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ మురుగు కాలువ వెలుపలి వరకు తీసి మిగతా పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు చోటు చేసుకుంటుందని వారు చెబుతున్నారు. ఈ విషయం గురించి ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాసింబౌలి గ్రామంలో పొంగిపొర్లుతున్న మురుగును శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను వివరణ కోరగా కాసింబౌలిలో మురుగు కాలువ పొంగిపొర్లుతున్నది వాస్తవమేనన్నారు. ఈ మురుగు పారడానికి సరైన కాలువ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీలో మురుగు కాలువ పనులు చేయడానికి సరిపడా నిధులు లేవన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో నంబర్ వన్



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పాత ఆగిర్యాల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని చెప్పారు. గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో రాష్ట్రం ఎంతో పురోభివృద్ధి సాధించిందన్నారు. రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు వివిధ దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. దీనికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ ఈట గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. దామరగిద్ద నుంచి చనువెళ్లి వెళ్లే రోడ్డు మధ్యలో వాగుపై రూ.20లక్షల నిధులతో మంజూరైన బ్రిడ్జి పనులకు మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని ఎన్నో హామీలను నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. మళ్లీ మూడో సారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రజలను కోరారు. దామరగిద్ద సర్పంచ్ ఎం వెంకటేశంగుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ప్రభాకర్, జహంగీర్, పాల్గొన్నారు.

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు రేపు స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్: శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ, ఒకేషనల్(పీఎస్‌టీటీ) కోర్సుల్లో ప్రవేశాలకు 31న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కళాశాలలోనే స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9347197486 సెల్ నెంబర్‌ను సంప్రదించొచ్చన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్



మాట్లాడుతున్న ప్రకాశ్

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని ప్రతీ ఇంటికి తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ స్థానం నుంచి అధిష్టానం కేటాయించిన వారి గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబ పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. రంగారెడ్డి జిల్లాలోని విలువైన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్ వ్యాపారులకు కట్టబెట్టి కోట్లు గడించిందన్నారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్, మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు తప్పనిసరి

కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పార్థసారథి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు స్నేహబేనారి

మొయినాబాద్‌రూరల్: నేత్ర సంరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి పార్థసారథి అన్నారు. మంగళవారం అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో వాసన్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ కంటి పరీక్షలు ప్రతీ ఒక్కరు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారు కంటి అద్దాలు వాడాలన్నారు. కంటి జాగ్రత్తలు తీసుకున్నప్పుడే కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ కంటి నిపుణులు స్నేహ బేనారి, డాక్టర్ కెఎస్ జగన్నాథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

సర్పంచ్ బసిరెడ్డి పద్మ

షాద్‌నగర్: గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ బసిరెడ్డి పద్మ అన్నారు. కంసాన్‌పల్లి గ్రామంలో ఆసరా పథకం కింద లబ్ధిదారులకు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పెరిగిన పెన్షన్ డబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ హాయంలో పెన్షన్ రూ.200లు మాత్రమే ఇచ్చేవారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ వికలాంగులకు ప్రస్తుతం రూ.4,016 పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. బీసీ, మైనార్టీ కులవృత్తుల వారికి రూ. లక్ష సాయం అందజేయనున్నారన్నారు. తద్వార గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాయ మాటలు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, వీరమ్మ, నర్సింలు, బాలవర్ధన్‌రెడ్డి, వెంకటయ్య, రవి పాల్గొన్నారు.

బహుజన రాజ్యంతోనే పేదలకు న్యాయం


బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయార్య



బీఎస్పీ జెండా ఆవిష్కరించిన విజయార్య

చేవెళ్ల: బహుజన రాజ్యం వస్తేనే రాష్ట్రంలో పేదలకు సరైన న్యాయం జరుగుతుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయార్య అన్నారు. ఆలూరు గ్రామంలో మంగళవారం ఊరూరా జెండా కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గం అధ్యక్షుడు జిచందు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరులో బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎస్పీని ప్రతీ గ్రామంలో బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ అన్ని నియోజక వర్గాల్లో పోటీ చేస్తుందన్నారు. ఏనుగు గుర్తుతో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నీలి జెండా ఎగురబోతుందని వారు జోస్యం చెప్పారు. విద్యా, వైద్యం, ఉపాధి తదితర వాటిపై పోరాటం, ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను వివరించి, భవిష్యత్‌లో బీఎస్పీ చేపట్టబోయే సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి అబ్రహంలింకన్, రాజా మహేంద్రవర్మ, జనరల్ సెక్రటరీ జామచంద్రం, మండల అధ్యక్షుడు మొకరం కుమార్, షాబాద్ అధ్యక్షుడు వెంకటేశ్, నవాబ్‌పేట అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకులు బొర్ర అనంతరాములు, మొకరం రాజు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ కన్వీనర్‌గా జగన్



కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్‌గా పెంజర్ల గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జగన్ నియమితులయ్యారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ తనను ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. తన వంతు బాధ్యతగా నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు మరింతగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ప్లాట్లు కబ్జా చేసేందుకు యత్నం

మోకిల ఎస్సీ కాలనీ వాసుల ఆరోపణ

శంకర్‌పల్లి: మోకిల గ్రామంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి ఎస్సీ కాలనీలోని ప్లాట్లను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 31లో 5ఎకరాల, 6గుంటలభూమి నగరానికి చెందిన సయ్యద్ మిర్జా ఆధీనంలో ఉంది. గ్రామ పెద్దలు, తాము ఆయనను ఒప్పించి ఆ భూమిని 35సంవత్సరాల క్రితం తీసుకున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులందరు కలిసి లేఅవుట్‌గా మార్చుకున్నారన్నారు. దీంతో ఒక్కో కుటుంబానికి 110గజాల చొప్పున పంపిణీ చేసుకున్నట్టు చెప్పారు. ఇంకా ఈ లేఅవుట్‌లోని ప్లాట్లలో కొన్ని మిగలడంతో వాటిని ఫంక్షన్ హాల్ నిర్మాణానికి వారు తీర్మానం చేసుకున్నట్లు తెలిపారు. కాగా తమ గ్రామానికే చెందిన ఓ పోలీస్ ఉన్నతాధికారి మూడు ప్లాట్లపై కన్నేసి నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని వారు ఆరోపించారు. నకిలీ పత్రాలు సృష్టించడమే కాకుండా తమపై దౌర్జన్యానికి దిగుతున్నాడని ఎస్సీకాలనీ వాసులు చెబుతున్నారు. ఈ విషయం గురించి గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతిలో మాట్లాడడానికి రావడం లేదన్నారు. తన అధికార బలంతో మూడు రోజులుగా మోకిల పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నాడని వాపోయారు. మోకిల పోలీసులు సైతం ఆయనకే వత్తాసు పలుకుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా పోలీస్ స్టేషన్ ఎదుట పడిగాపులు కాస్తున్నా తమకు న్యాయం చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



మోకిల పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

పత్తి పంటలో సస్యరక్షణకు చర్యలు

షాబాద్ మండల వ్యవసాయధికారి వెంకటేశం



మందు సంచులు పంపిణీ చేస్తున్న వెంకటేశం

షాబాద్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయధికారి వెంకటేశం అన్నారు. మంగళవారం తిమ్మారెడ్డిగూడలో జాగృతి ప్రాజెక్టులో భాగంగా యల్డిసి, వెల్‌స్పన్ ఆధ్వర్యంలో రైతులకు పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీంచారు. రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు పురుగు వచ్చే అవకాశం ఉందని రైతులకు సూచించారు. బేయర్ క్రాఫ్ సైన్స్ కంపెనీ మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పత్తి పంటను జనవరి తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ చేనులో ఉంచకూడదన్నారు. పంటకు నీరు ఎరువులు పెట్టి పంట కాలాన్ని పొడిగించొదన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధి ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ శంకుతల, ఎంపీటీసీ సునీత, మాజీ ఎంపీటీసీ పాండు, వాద్వాని కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, వెల్‌స్పన్ టీం సభ్యులు, రైతులు రామస్వామి, పాండు, నర్సింహులు, గోపాల్, హరీశ్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



కొందుర్గు: మండల స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

కొందుర్గు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విద్యార్థులను ఎంపిక చేసినట్లు పిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వాములు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జోనల్ స్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపికలో ఎస్ఐ కృష్ణయ్య, శ్రీదేవి, పీఈటీ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: జోనల్ స్థాయి క్రీడలకు మండల పరిధిలోని వివిధ పాఠశాలలనుంచి విద్యార్థులను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జోనల్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియలో మండల పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మాడల్ స్కూల్స్, మైనార్టీ స్కూల్స్, కేజీబీవీ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14, 17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ పాల్గొనేందుకు దాదాపు 150మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ పోటీలు సెప్టెంబర్ 2న రాయికల్‌లో కబడ్డీ, 4న కేశంపేటలో వాలీబాల్, 6న కొందుర్గులో ఖోఖో నిర్వహించనున్నారని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు ఎజ్కెల్, బాలయ్య, మోనాలీసా, అనిత, నిర్మల, వరలక్ష్మి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేసే పార్టీ కాంగ్రెస్సే



మాట్లాడుతున్న శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

కొందుర్గు: పేదల అభ్యున్నతికి కృషి చేసే పార్టీ కాంగ్రెస్సేనని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లను తరిమికొట్టాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. 'తిరగబడదాం.. తరిమికొడదాం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేగడిచిల్కమర్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని ఆయన పేర్కొన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు అందరం కృషిచేయాలని కోరారు. వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని అన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కృష్ణా రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ భాషలలో తెలుగుకు గుర్తింపు

షాద్‌నగర్‌రూరల్: ప్రపంచ భాషలలో తెలుగు భాషకు ప్రత్యేక గర్తింపు ఉందని దీపికా మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి అన్నారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని మంగళవారం దీపికా మెమోరియల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ మన తెలుగు భాష తేనెలకన్నా ఎంతో తీయనైన భాష అన్నారు. తెలుగు భాష కన్నతల్లిలాంటిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, శారద, మోహన్, సురేశ్, స్వర్ణలత, పావని, విజయలక్ష్మి, నసీమా, రామస్వామి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



బహుమతులు అందజేస్తున్న అంజయ్య యాదవ్

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రంగాపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇష్టమైన క్రీడను ఎంచుకోవాలన్నారు. గ్రామీణా ప్రాంత విద్యార్థులను, ప్రోత్సహించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. కబడ్డీలో లిటిల్ ఎంజిల్ స్కూల్, ప్రథమ బహుమతి, ఖోఖోలో ఇన్ముల్ నర్వ లిటిల్ ఎంజిల్ స్కూల్ బాలికలు, వాలీబాల్‌లో కొత్తూరు గురుకుల పాఠశాల విద్యార్థులు గెలుపొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు కడల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.